కబ్జాలు.. కట్టడాలు!

కూటమి నేతలు సెంటు భూమిని కూడా వదిలిపెట్టకుండా కబ్జా చేసేస్తున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే గద్దల్లా వాలిపోతున్నారు. ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కబళించేస్తున్నారు. రెవెన్యూ అధికారులను లోబరుచుకుని రికార్డులు తారుమారు చేసేస్తున్నారు. నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించేసుకుంటున్నారు. ప్రజల ఆస్తులను పరిరక్షించాల్సిన ప్రతినిధులు సైతం బినామీ పేర్లతో వ్యవహారం నడిపిస్తున్నారు. చోటా నాయకులను అడ్డుపెట్టుకుని దందా సాగిస్తున్నారు. కొన్నిచోట్ల ఆక్రమిత భూముల్లో అక్రమంగా కట్టడాలను నిర్మించేస్తున్నారు. అక్రమార్కులపై ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు మాత్రం తూతూమంత్రంగా చర్యలు చేపట్టి చేతులుదులిపేసుకుంటున్నారు.

- రెచ్చిపోతున్న కూటమి నేతలు
- అధికారమే అండగా ఆక్రమణలు
- ఖాళీ స్థలం కనిపిస్తే పాగా
- రెవెన్యూ సిబ్బంది సహకారంతో రికార్డులు తారుమారు
- అక్రమార్కుల చెరలో ప్రభుత్వ భూములు
- వ్యవహారం నడిపిస్తున్న ప్రజాప్రతినిధులు

సాక్షి టాస్క్‌ఫోర్స్:ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో ప్రభుత్వ భూములకు గడ్డుకాలం ఎదురవుతోంది. సెంటు భూమి కనిపించినా కబ్జాదారులు పాగా వేస్తున్నారు. ఇటీవల కాలంలో ఓ ఎమ్మెల్యే సమీప బంధువులు నేరుగా భూ ఆక్రమణలకు దిగుతుండడం గమనార్హం. స్థానిక చోటామోటా నాయకులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమిస్తున్నారు. తిరుపతి అర్బన్ రెవెన్యూ అధికారుల అండదండలతో రికార్డులను తారుమారు చేసేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.నగరంలో ఇటీవల వరుసగా జరిగిన భూ ఆక్రమణ ఘటనలు కలకలం రేపుతున్నాయి. మొన్న సత్యనారాయణపురం, నిన్న శివజ్యోతి నగర్, నేడు ఎస్టీవీ నగర్ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ భూములకు రక్షణ గగనంగా మారిపోయింది. ఈక్రమంలోనే ఇప్పుడు సుబ్బారెడ్డి నగర్ పరిధిలోని ప్రభుత్వ భూమిపై సదరు ఎమ్మెల్యే కన్ను పడింది. దీంతో ఈ భూమికి మూడిందంటూ పలువురు కూటమి నేతలే చెవులు కొరుక్కుంటున్నారు.


సుబ్బారెడ్డినగర్‌లోని ప్రభుత్వ భూమి

ఇప్పటివరకు రెవెన్యూ రికార్డుల్లో అది ప్రభుత్వ భూమిగానే ఉంది. రేపో మాపో నకిలీ రికార్డులు సష్టించి రెవెన్యూ రికార్డులను తారుమారు చేసేందుకు ఓ అధికారి పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

స్థలం విలువ రూ.6 కోట్లపై మాటే..

సుబ్బారెడ్డి నగర్ పరిధిలోని అక్కారంపల్లె లెక్క దాఖలా సర్వే నంబర్ 112 /10 లో సుమారు 20 సెంట్ల ప్రభుత్వ భూమి ఉండేది అందులో 8 సెంట్లు ఇప్పటికే ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేశారు. దీంతో 12 సెంట్లు భూమి మాత్రమే మిగిలింది. ప్రస్తుతం ఇక్కడ అంకణం విలువ రూ.4 లక్షల పైనే పలుకుతోంది. మొత్తంగా ఈ భూమి విలువ రూ.6 కోట్లకు పైగానే ఉంటుంది. ఖరీదైన ఈ భూమిని ఆక్రమించుకునేందుకు ఓ ఎమ్మెల్యే సమీప బంధువులు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. రెవెన్యూశాఖలో పనిచేసే ఓ వ్యక్తి ఈ వ్యవహారాన్ని సాక్షి దృష్టికి తీసుకురావడం గమనార్హం. నకిలీ పత్రాలను సృష్టించి, రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించేందుకు పన్నాగాలు పన్నుతున్నారని ఆయన చెప్పుకొచ్చారు.

హెచ్చరిక బోర్డు తొలగింపు

సుబ్బారెడ్డి నగర్‌లోని ఆ 12 సెంట్ల భూమిలో ఇదివరకు ×ఈ ఈ భూమి ప్రభుత్వానిది. ఇందులోకి ఎవరు ప్రవేశించినా శిక్షార్హులు అనే హెచ్చరిక బోర్డు ఉండేది. ప్రస్తుతం ఆ బోర్డును తొలగించడంతో కబ్జాకు గురవుతోందనే సంకేతం బయటకు వచ్చింది. రెవెన్యూ అధికారులు వ్యవహారశైలిని గమనిస్తే కబ్జా తప్పదని తెలుస్తోంది.

ఆక్రమించి.. అక్రమ నిర్మాణం

చంద్రగిరి : మండలంలోని మల్లయ్యపల్లెలో కూటమి నేతలు యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు. తాజాగా సర్వే నంబరు 1065లోని కాలువ పోరంబోకులో ఉన్న 32 సెంట్ల భూమి ఆక్రమణకు గురైంది. ప్రధాన రహదారికి సమీపంలో ఈ భూమి ఉండడంతో దీనికి మంచి డిమాండ్ ఉంది. దీంతో గ్రామానికి చెందిన టీడీపీ నేత ఆక్రమణకు పాల్పడ్డారు. వారం క్రితం సదరు స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టారు. దీనిపై సాక్షి పత్రికలో వార్త ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు స్పందించి తూతూమంత్రంగా పనులు అడ్డుకున్నారు. మరుసటి రోజు నుంచే మళ్లీ నిర్మాణ పనులు మొదలుపెట్టడంతో రెవెన్యూ అధికారుల డొల్లతనం స్థానికులకు అర్థమైంది.

రూ.50లక్షలకు పైగానే..

పచ్చనేత కబళించిన ఈ భూమి విలువ సుమారు రూ.50లక్షలకు పైగానే ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. రాజకీయ ఒత్తిడితోనే రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

పరదాల మాటున గుట్టుగా..

అదే గ్రామ సమీపంలోని సర్వే నంబరు 1016లో సుమారు 3 ఎకరాలకు పైగా కాలువ పోరంబోకు భూమి ఉంది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాలువను కబ్జా చేసి ఓ మహిళా నేత అక్రమంగా కాంప్లెక్స్ నిర్మాణానికి పూనుకుంది. దీనిపై గ్రామస్తులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు మాత్రం శూన్యం. గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో కబ్జాలు చూడలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.


మల్లయ్యపల్లెలోని కాలువ పోరంబోకులో అక్రమ నిర్మాణం


మల్లయ్యపల్లె మార్గంలో రోడ్డు పక్కనే పరదాలు కట్టి సాగిస్తున్న నిర్మాణ పనులు

క్లుప్తంగా

వెంకటరామిరెడ్డికి పరామర్శ


వెంకటరామిరెడ్డిని పరామర్శిస్తున్న మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతికి చెందిన ఎంఎం హౌస్ అధినేత కదిరిమంగళం వెంకటరామిరెడ్డి అత్తయ్య యాబాకు సుబ్బమ్మ సోమవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మంగళవారం రామచంద్రాపురం మండలం నడవలూరులోని వారి ఇంటికి వెళ్లి సుబ్బమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. వెంకటరామిరెడ్డి, కుటుంబీకులను పరామర్శించారు. సర్పంచ్ గణపతిరెడ్డి, నేతలు తులసీరామి రెడ్డి, ముచ్చేలి కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుచ్చిపై సూర్యనారాయణుని విహారం


ఊరేగుతున్న స్వామివారు

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వెలసిన శ్రీసూర్యనారాయణ స్వామివారు మంగళవారం తిరుచ్చి వాహనంపై విహరించారు. స్వామివారి జన్మనక్షత్రమైన హస్త సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని సేవించుకున్నారు. అనంతరం సూర్యనారాయణుని తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు.

కబడ్డీలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విజేత


విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ స్టేడియంలో మంగళవారం అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించారు. 15 కాలేజీల జట్లు పోటీ పడగా ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. విజేత జట్టుకు ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి ట్రోఫీ బహూకరించారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. పీడీ అహ్మద్‌ను ప్రశంసించారు.

నేత్ర, దంత సమస్యలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యులు

తిరుపతి తుడా : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆర్‌సీ రోడ్డులోని ఈఎస్ఐ ఆస్పత్రిలో నేత్ర, దంత సమస్యలపై మహిళలకు అవగాహన కల్పించారు. మెడికల్ సూపరింటెండెంట్ శ్యామ్‌బాబు, ఆర్ఎంఓ జి.శివమహేశ్వర పాల్గొన్నారు. ఈ క్రమంలోనే వీవీ మహల్ రోడ్‌లోని శుభమస్తు షాపింగ్ మాల్‌లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. సిబ్బందికి వైద్యసేవలు అందించారు.

డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే


డాన్స్ చేస్తున్న విద్యార్థినులు

పాకాల : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. తొలి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ, తృతీయ ఏడాది విద్యార్థులు స్వాగతం పలికారు. ప్రిన్సిపల్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు రెడ్డిరామరాజు, ఉమామహేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ మాసులామణి, చిట్టకళావతి, అధ్యాపకులు మోహన్‌బెహరా, ఈశ్వర్‌బాబు, రమణమ్మ, మహబూబ్‌బాషా, డిల్లీప్రసాద్, కుమార్‌రాజా, వినోద్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 60,681 మంది స్వామివారిని దర్శించుకోగా 19,510 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.06 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

ఉచితంగా ఆయుర్వేద వైద్యం


మందులు అందిస్తున్న వైద్యులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్, ది మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ వారు మంగళవారం వీవీ మహల్ రోడ్డులోని రవి ఆయుర్వేద వైద్యశాలలో ఉచితంగా రోగులకు వైద్యసేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు. క్లబ్ ఇంటర్నేషనల్ రీజనల్ ప్రెసిడెంట్ తహసున్నీసా బేగం మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. వైద్యులు రాజేష్ కుమార్, రవికుమార్, జోత్స్న, కార్తీక్, క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్స్ మహేంద్ర, కుమార్, ధనంజయ, సునీల్ నాయక్, డైరెక్టర్ జయశంకర్, సెక్రటరీ మణికంఠ పాల్గొన్నారు.

26లోపు ఓటరు జాబితా అనుసంధానం


మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు 2002 ఓటరు జాబితాతో 2025 జాబితాను ఈ నెల 26వ తేదీలోపు అనుసంధానం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. మంగళవారం కచ్చపి ఆడిటోరియంలో బీఎల్‌ఓలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రెండు జాబితాలను సరిపోలుస్తూ ఎవరెవరు ఎక్కడ ఉన్నారో గుర్తించాలని సూచించారు. అనంతరం పీ–4 సర్వే పై సచివాలయ కార్యదర్శులకు డిజిటల్ శిక్షణ ఇచ్చారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవెన్యూ ఆఫీసర్ రవి, తహసీల్దార్ సురేష్ బాబు పాల్గొన్నారు.

'లోక్ కల్యాణ్' మేళాను సద్వినియోగం చేసుకోండి


వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తిరుపతి సిటీ : కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రూపొందించిన 'లోక్ కల్యాణ్ మేళా'ను వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ ఎఫ్రాయిం పిలుపునిచ్చారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) తిరుపతి నగర పాలకసంస్థ పరిధిలోని వీధి వ్యాపారులు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పీఎం స్వనిధి 2.0 లో భాగంగా మొదట విడత 15 వేల రూపాయలు, రెండవ విడత 25 వేల రూపాయలను పెంచి విడుదల చేస్తున్నారని తెలిపారు. తిరుపతిలో మొత్తం 1835 వీధి వ్యాపారులకు రుణాలు వివిధ దశలలో మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వీధి వ్యాపారులు, కుటుంబ సభ్యులకు అక్టోబర్2 వరకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లేబర్ ఆఫీసర్ రంగనాథ్ మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా ప్రతి అసంఘటిత రంగ కార్మికులు ప్రయోజనం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సుధారాణి, మెప్మా టీఈ ప్రమీల, సిటీ మిషన్ మేనేజర్లు కృష్ణవేణి, సోమకుమార్, టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

గిరి బలిజ జీఓ రద్దుకు వినతి


ఆర్డీఓకు వినతి పత్రం అందిస్తున్న కృష్ణప్రసాద్ తదితరులు

తిరుపతి రూరల్ : గిరి బలిజ జీఓను రద్దు చేయాలని బలిజసేన అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ కోరారు. మంగళవారం ఈ మేరకు ఆర్డీఓ రామ్మోహన్‌కు వినతి పత్రం అందించారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 30శాతానికి పైగా బలిజ, కాపు సమూహాలు ఎటువంటి రిజర్వేషన్లు లేక అన్ని రంగాల్లో అణిచివేతకు గురవుతున్నాయన్నారు. ఈ తరుణంలో చిన్న కులాలను బలిజల్లో కలపడం భావ్యం కాదన్నారు. దొమ్మర కులాన్ని గిరి బలిజగా పేరు మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని మండిపడ్డారు. దొమ్మరి కులానికి తాము వ్యతిరేకం కాదని, వారిని కూడా గౌరవిస్తూ మరొక పేరు కేటాయించాలని సూచించారు. లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బలిజ సేన నేతలు ధరణి కుమార్, కేఆర్ సుబ్రమణ్యం, వాసు రామారావు, గోపి, బసికర్ల రఘు, శిరీష, కోకిల పాల్గొన్నారు.

'రాస్'లో క్యాన్సర్ వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి కల్చరల్: పద్మావతి మహిళా వర్సిటీ సహకారంతో మంగళవారం రాస్ సేవానిలయంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం నిర్వహించారు. టాటా ట్రస్ట్ అధికారి హేమంత్ మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారిని అవగాహన ద్వారా నిర్మూలించాలని పిలుపు నిచ్చారు. పొగాకు, గుట్కా, మద్యపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. రాస్ పొదుపు సంఘాల డైరెక్టర్ వి.నాగరాజు మాట్లాడుతూ మహిళల్లో ఎక్కువగా గర్భసంచి, రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, పరీక్షలు చేసుకుని తొలి దశలోనే గుర్తిస్తే వ్యాధిని జయించవచ్చని తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ డి.హైమావతి మాట్లాడుతూ 30 ఏళ్లు దాటినవారు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేసుకోవాలని కోరారు. రాస్ సిబ్బంది ఎల్.బాలాజీ, భ్రమరాంబ, క్లస్టర్ లీడర్ దీప పాల్గొన్నారు.

ఇంటర్ స్కూల్స్ ఫెస్ట్‌లో ఆర్‌కే గ్రూప్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులతో యాజమాన్యం, అతిథులు

తిరుపతి సిటీ: యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తిరుపతిలో సోమవారం నిర్వహించిన యూఎస్ఓ ఇంటర్ స్కూల్స్ ఫెస్ట్–2025లో ఆర్‌కే గ్రూప్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ విద్యార్థులు తమ ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నారు. చిత్రలేఖనం, ఇంగ్లీష్ స్పీచ్, గ్రూప్ డ్యాన్స్, డ్రామా, సైన్స్ ఫెయిర్ వంటి విభాగాల్లో విద్యార్థులు తమ సృజనాత్మకత, నైపుణ్యం, సమన్వయాన్ని ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ కేవీఎన్ కుమార్, అప్పుస్మ నాయకులు డాక్టర్ విశ్వనాథ రెడ్డి, సంస్థ చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి తదితరులు విద్యార్థులను అభినందించారు.

నోటీస్ బోర్డు

- తిరుమల పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు సాయంత్రం 5.35 గంటలకు తిరుపతిలోని తాజ్ హోటల్ వద్ద హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరుతారు.
- బాలాజీ కాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో సాయంత్రం 5.30 గంటలకు పూణే ఒప్పందంపై చర్చా వేదిక.

సీఎం కాన్వాయ్ ట్రయల్‌రన్

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం తిరుమలకు రానున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సీఎం కాన్వాయ్ ట్రయల్‌రన్ నిర్వహించారు. ఈ మేరకు వాహనశ్రేణి రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుమలకు రాకపోకలు సాగించింది. ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షించారు. అలాగే ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని తిరుమల ఘాట్‌రోడ్లలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

సూక్ష్మజీవుల పాత్ర కీలకం


విద్యార్థినులతో అతిథులు, అధ్యాపకులు

తిరుపతి రూరల్ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో మంగళవారం సూక్ష్మజీవుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు చేపట్టారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. డాక్టర్ జి.నరసింహ, ప్రొఫెసర్ పి.సువర్ణలతా దేవి, ప్రొఫెసర్ పి. ఉమామహేశ్వరి దేవి, ప్రొఫెసర్ ఆర్.జయమాధురి, డాక్టర్ ఎం.వాణి, డాక్టర్ కె.జ్ఞానేశ్వరి డాక్టర్ కె.రుక్మిణి పాల్గొన్నారు.

దేదీప్యం.. దివ్యరూపం

- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- విశేషాలంకరణలో అమ్మవారు

తిరుపతి కల్చరల్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకం, హోమం, కుంకుమార్చన చేపట్టారు. అలాగే కొత్తవీధిలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మీనాక్షిదేవిగా కొలువుదీరారు. మంగళం రోడ్డులోని బొంతాలమ్మ ఆలయంలో అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు కటాక్షించారు.


తిరుపతి రూరల్ : తుమ్మలగుంట క్రాస్ రోడ్డు ఎల్ఎస్ నగర్ వద్ద శక్తి చాముండేశ్వరి అమ్మవారు కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విశేష పూజలు, అన్నదానానికి ఉభయకర్తలుగా ఎస్.సబిత, భాస్కర్‌రెడ్డి, కన్నెమ్మ, రాజశేఖర్ వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చంద్రగిరి: పుట్టాలమ్మ ఆలయంలో అమ్మవారు సంతోషి మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి సహస్రమానార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామచంద్రాపురం : సూరావారిపల్లెలోని సురభి గోసంరక్షణశాలలో ఏకవీర సేవా ఫౌండేషన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో బాలత్రిపురసుందరిదేవిని కొలువుదీర్చారు. విశేష పూజలు నిర్వహించారు. మహిళలకు పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

శక్తిపీఠంలో..

రాయలచెరువు సమీపంలోని శ్రీశక్తిపీఠంలో శ్రీదశమహావిద్యా దేవతల దివ్యోత్సవాలు నిర్వహించారు. నవరాత్రుల్లో భాగంగా కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతీ, పీఠాధీశ్వరి శ్రీరమ్యానంద భారతీ వారి ఆధ్వర్యంలో శ్రీబగళాముఖీ దేవికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, హోమం, పూర్ణాహుతి చేపట్టారు.


మీనాక్షి దేవిగా కన్యకాపరమేశ్వరి


బాలత్రిపురసుందరీదేవిగా గంగమ్మ


కాత్యాయనీదేవిగా చాముండేశ్వరి


సంతోషిమాతగా పుట్టాలమ్మ


బాలత్రిపురసుందరిగా అమ్మవారు


విశేష అలంకరణలో బగళాముఖీదేవి

పండుగలు.. ప్రత్యేక రైళ్లు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : పండుగల సీజన్ ప్రారంభం కావడంతో ప్రత్యేక రైళ్లను నడిపేందుకు రైల్వేశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. దసరా, దీపావళి పండగల సమయంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. అలాగే మహారాష్ట్రలోని జాల్నా నుంచి తిరుచానూరు వరకు 12 ప్రత్యేక రైళ్ల రాకపోకలు సాగించనున్నట్లు అధికారులు ప్రకటించారు. అక్టోబర్ చివరి వారం వరకూ ఈ రైళ్ల ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. జాల్నా నుంచి బయలుదేరే రైలు పర్తూర్, సేలు, పర్బాణి, గంగాఖేర్, పార్లీ వైద్యనాథ్, లాతూర్ రోడ్, ఉద్గిర్, భాల్కీ, బీదర్, జహీరాబాద్, మర్పల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, చిత్తాపూర్, సూలేహళ్లి, యాద్గిర్, రాయచూర్, మంత్రాలయం రోడ్, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లె, పీలేరు, పాకాల, తిరుపతి మీదుగా తిరుచానూరుకు రాకపోకలు సాగిస్తుంది.

శ్రీవారి సేవలో పుల్లెల గోపీచంద్

తిరుమల: బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు.రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.